బీజేపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

- ముఖ్య నాయకుల సమావేశంలో కార్యకర్తలకు దిశానిర్దేశం
- నేడు చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి నామినేషన్
- హాజరుకానున్న కేంద్రమంత్రి పీయూష్ గోయల్

రాజేంద్రనగర్: చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం రాజేంద్రనగర్ బీజేపీ అధ్యక్షులు జి.బాబురావు ఆధ్వర్యంలో స్థానిక బీజేపీ కార్యాలయంలో డివిజన్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ప్రేంరాజ్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సోమవారం ఉదయం చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి కేంద్రమంత్రి పీయూష్ గోయల్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి హాజరుకానున్నారన్నారు.ఈ సందర్భంగా బుద్వేల్‌లోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి డాక్టర్ బాబా సాహేబ్ అంబేడ్కర్ విగ్రహం వరకు దాదాపు 50 వేల మంది కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి గెలుపు ఖాయమని, 3 లక్షల మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. ప్రధాని మోదీని మూడోసారి ప్రధాని కాబోతున్నారన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, కె.సదానంద్, మూల శ్రీనివాస్ గౌడ్, కె.హరికిషన్, బాలకృష్ణ, సందీప్, వనితా రెడ్డి, నాగమణి, టి.మల్లేష్, మల్లేష్ చారి, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన

హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్



విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్న ప్రభాకర్ తదితరులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్, బుద్వేల్ కోట మైసమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి రేవల్లే రాజు శర్మ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర గౌడ సంఘం కోశాధికారి హరిచరణ్ గౌడ్ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ దేవాలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం స్థానిక ప్రాంతాలకు చెందిన మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మరికొందరు మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రేమ్‌దాస్ గౌడ్, స్వర్గీయ ఇంద్రారెడ్డి ట్రస్టు చైర్మన్ కార్తీక్ రెడ్డి, దేవాలయ కమిటీ ప్రతినిధులు దాస్ గౌడ్, పెంటయ్య గౌడ్, నందం గౌడ్, సత్యనారాయణ గౌడ్, నరసింహ గౌడ్, వినాయక గౌడ్, పెండ్యాల శ్రీధర్‌తో పాటు కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నిర్ణయం అభినందనీయం

శంషాబాద్ రూరల్: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ పార్టీ మారనని చెప్పడం అభినందనీయమని జూకల్ మాజీ సర్పంచ్ పి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లడానికి ఎమ్మెల్యే స్థానిక నాయకులు, కార్యకర్తల సూచనలు తీసుకోవడం, బీఆర్ఎస్‌ను వీడేదిలేదని చెప్పడం మంచి పరిణామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు మంచి ఆదరణ ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలవడం ఖాయమన్నారు.

నేడు మాజీ హోంమంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి వర్ధంతి

రాజేంద్రనగర్: మాజీ హోంమంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు సామ ఇంద్రపాల్ రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్ పీడీపీ చౌరస్తాలో ఉదయం 9.30 గంటలకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఇంద్రారెడ్డి సానుభూతిపరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

రాజేంద్రనగర్: ఏ1 చారిటుబల్ ట్రస్ట్ (ఎన్‌జీఓ) సంస్థ ఆధ్వర్యంలో ప్రేమావతిపేట్ గ్రామంలో ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలని కోరుతూ, ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ సంస్థ హైదరాబాద్ సెక్రటరీ ఎడ్లకాడి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎడ్లకాడి సూర్యం, బర్ల సుమన్, కవ్వగూడెం గౌతమ్, బోలోజి సురేశ్, కె.రాజు కుమార్, పోయిల వికాస్, ఎ.స్వామి, లింగమ్మ, శామనీల, పోచమ్మ, ఘన్నీ, నిఖిత, పూవులమ్మ, పున్ని, సోని తదితరులు పాల్గొన్నారు.

కరాటే బెల్టుల ప్రదానం



బెల్టులు అందుకున్న విద్యార్థులు

రాజేంద్రనగర్: అత్తాపూర్‌లోని జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు బెల్ట్ పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి బెల్టులను ప్రదానం చేశారు. విజేతలకు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాస చారి, బాలసుబ్రమణ్యం, పవన్ భారతి బెల్టులు అందజేశారు. విద్యార్థులు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు, డాక్టర్ల బృందం

బండ్లగూడ: ప్రస్తుత యాంత్రిక జీవితంలో ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తగు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ భవానీ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అశోక్ కుమార్ అన్నారు. వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అపోలో ఆసుపత్రి సహకారంతో మెగా ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ స్క్రీనింగ్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. 160 మందికి పైగా వైద్య సేవలు అందించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అపోలో యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు శైలజాజ్ఞానేష్, సెక్రటరీ జనరల్ వెంకటేష్, కోశాధికారి నాగేశ్వర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు చక్రధర్‌రెడ్డి, కిరణ్‌బుడ్డే, రాజ్‌కుమార్, ప్రేమ్, తిరుపతిరెడ్డి నాయకులు సుధాకర్, నరేందర్‌బాబు, నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

శంషాబాద్: పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ తండ్రి, సాతంరాయి మాజీ సర్పంచ్ జల్లపల్లి జంగయ్య ఇటీవల మృతి చెందడంతో ఆదివారం ఆయనను పలువురు నేతలు పరామర్శించారు. మాజీ ఎంపీ సర్వేపల్లి సత్యనారాయణ, చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు జంగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్, అక్రమ్‌ఖాన్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

యువతి అదృశ్యం



నందిని(ఫైల్)

శంషాబాద్ రూరల్: ఓ యువతి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దషాపూర్‌కు చెందిన నందిని(19) ఈ నెల 20న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'నీటి కొరతను సొమ్ము చేసుకుంటున్నారు'



కార్పొరేటర్ బి.సాగర్‌గౌడ్

బండ్లగూడ: ప్రజలకు సక్రమంగా మంచినీటి సరఫరా చేయకుండా జలమండలి అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని అమ్ముకుంటున్నారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ 20వ డివిజన్ కార్పొరేటర్ బి.సాగర్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌కు 13.5 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. అయితే ఈ నీటిని పూర్తిగా ప్రజలకు అందించడం లేదన్నారు. దీంతో ప్రజలకు నీరు సరిపోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. పలు ప్రాంతాల్లో వారానికి ఒకసారి కూడా నీరు విడుదల చేయడం లేదని ఆరోపించారు. అయితే జలమండలి అధికారులు మాత్రం ప్రతి రోజూ ప్రతి కాలనీకి నీటిని అందిస్తున్నామని తప్పుడు రికార్డులు సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. దీనిపై ప్రశ్నించిన ఎలాంటి ఆధారాలు, రికార్డులు చూపించేందుకు జలమండలి అధికారులు సిద్ధంగా లేరన్నారు. ప్రతి ట్యాంకర్‌కు రూ. 500 వసూలు చేస్తున్నారన్నారు. ఈ లెక్కన ప్రతి రోజూ 250 ట్యాంకర్లను ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తూ రూ 40 లక్షలు ఆర్జిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకుని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



జలమండలి కార్యాలయం వద్ద ట్యాంకర్లను నింపుతున్న దృశ్యం

నియోజకవర్గాలకు తరలిన ఈవీఎంలు



ఈవీఎంలను తరలిస్తున్న అధికారులు

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లా పరిధిలోని నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను ఆదివారం భారీ బందోబస్తు మధ్య తరలించారు. రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న రంగారెడ్డి జిల్లా ఈవీఎంల గోదాముల నుండి కంటైనర్లలో నియోజకవర్గాలకు తరలించారు. ఉదయం వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను గోదామ్‌లో సీల్ తీసి ఈవీఎంలను పరిశీలించారు. అనంతరం 14 నియోజకవర్గాలకు ఈవీఎంలను భారీ బందోబస్తు మధ్య తరలించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను వెటర్నరీ కళాశాల భవన సముదాయంలోని గోదాంకు తరలించారు. గోదాంలో భద్రపరిచిన అనంతరం పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు.

'రాంగ్‌రూట్'పై స్పెషల్ డ్రైవ్

10 మందిపై కేసులు నమోదు



బండ్లగూడలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న నార్సింగి ట్రాఫిక్ సీఐ కృష్ణ తదితరులు

బండ్లగూడ: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నార్సింగి ట్రాఫిక్ సీఐ కృష్ణ అన్నారు. ఆదివారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వాహనాల తనిఖీలతో పాటు రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్న 10 వాహనదారులపై కేసులు నమోదు చేయడంతో పాటు చలాన్లు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. రాంగ్ రూట్‌లో వాహనాలు నడపడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వీటిని నివారించేందుకు ఎప్పటికప్పుడు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన, మైనర్లకు వాహనాలు ఇచ్చిన యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. తనిఖీల్లో సత్యనారాయణ, ఎస్సై లింగనాయక్, కానిస్టేబుల్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వార్థ ప్రయోజనాల కోసమే ఆరోపణలు



డీసీపీకి ఫిర్యాదు చేస్తున్న ముచ్చింతల్ వాసులు

శంషాబాద్ రూరల్: ఎస్సీ,ఎస్టీ సెల్ మాజీ సభ్యుడు సీహెచ్.నర్సింహ తన స్వార్థ ప్రయోజనాల కోసం గ్రామాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న వారిపై నిరాధారోపణలు చేస్తున్నారని ముచ్చింతల్ వాసులు అన్నారు. ఈ మేరకు ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు.

గ్రామాభివృద్ధి కోసం సంపూర్ణ సహకారం అందిస్తున్న మైహోం గ్రూపు సంస్థ యాజమాన్యంపై నర్సింహ గ్రామస్తులకు అపోహలు కల్పిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్వలాభం, ఆర్థిక లబ్ధి కోసం ఆరోపణలు చేస్తూ ప్రభుత్వ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. విద్య, వైద్యం సేవలు అందిస్తున్న మైహోం సంస్థపై నిరాధార ఆరోపణలు చేస్తున్న నర్సింహపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రీడలతో శారీరక దృఢత్వం



రోలర్‌లను అందజేస్తున్న నరేందర్‌రెడ్డి

మణికొండ: ప్రతి ఒక్కరు తమ దినచర్యలో వారికి నచ్చిన క్రీడను చేర్చుకుని ప్రతి రోజు సాధన చేస్తే ఆరోగ్య పరంగా ఎంతో మేలు జరుగుతుందని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పంచవటి కాలనీలోని క్రీడామైదానాలను చదును చేసేందుకు అవసరమయ్యే మూడు రోలర్లను తన సొంత నిధులతో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని పార్కులకు ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేశామన్నారు. కాలనీలో బాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ క్రీడాకారులకు పిచ్‌లను తయారు చేసుకునేందుకు రోలర్‌లు కావాలని కోరడంతో వాటిని అందజేశామన్నారు, వాటిని సద్వినియోగం చేసుకుని క్రీడాకారులుగా రాణించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎం, రాఘవరెడ్డి, పంచవటి కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



వార్షికోత్సవంలో పాల్గొన్న యోగా సాధకులు

మణికొండ: ప్రతి రోజు యోగా చేయడం ద్వారా ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండి తమ రోజు వారి విధులను సక్రమంగా చేసుకోగలుగుతారని ఎంజీ పార్క్ యోగా నిర్వాహకుడు ఆనందరావు అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, ఎంజీ పార్కులో యోగా తరగతులు ప్రారంభమై ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు యోగా తరగతులకు వచ్చి శిక్షణ పొందుతున్న వారిని అభినందించారు. మన దిన చర్యలో యోగ అంతర్భాగం అయిపోయిందన్నారు. భారతీయ యోగ సంస్థాన్ 58వ వార్షికోత్సవాన్ని ఈ సందర్భంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో యోగా సాధకులు పాల్గొన్నారు.

అసదుద్దీన్ ఒవైసీని గెలిపించాలి



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్

గోల్కొండ: అభివృద్ధిని కోరుకునే వారే మజ్లిస్ పార్టీకి ఓటు వేస్తున్నారని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన గోల్కొండ డివిజన్‌లోని చోటాబజార్, బడా బజార్, మోతీదర్వాజా తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలుసుకున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో మరోసారి హైదరాబాద్ మజ్లిస్ సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని గెలిపించాలని ఆయన కోరారు. కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధికి అసదుద్దీన్ ఎంతో కృషి చేశారన్నారు. మజ్లిస్ పార్టీ సెక్యులర్ విధానాలకు కట్టుబడి ఉందని కార్వాన్ నియోజకవర్గంలో ఆలయాలు, శ్మశానవాటికల అభివృద్ధికి తాను కృషి చేశానన్నారు. మజ్లిస్ నాయకులు ఏకే పటాన్, హారూన్‌ఫరాన్, అమీరుద్దీన్ తదితరులున్నారు.

చెరువులను పరిరక్షించుకోవాలి



ముష్కి చెరువును శుభ్రం చేస్తున్న వలంటీర్లు



చెరువుల పరిరక్షణ ఆవశ్యకతను నృత్య రూపంలో వివరిస్తున్న విద్యార్థినులు

'ధృవాన్ష్' ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమాలు

మణికొండ: చెరువులు అనేక జీవరాశుల మనుగడకు ఆధారమని, అవి మనకు నీటిని అందిస్తాయని, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని 'ధృవాన్ష్' స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు మధులిక చౌదరి అన్నారు. ఆదివారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ముష్కి చెరువుల వద్ద క్లీనింగ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువుల్లోకి మురుగు నీరు చేరటం, ప్లాస్టిక్ చేరటంతో అనేక జీవరాశులకు ముప్పు వాటిల్లుతుందన్నారు. చెరువుల పరివాహక ప్రాంతాల్లో పేరుకుపోతున్న చెత్తా, చెదారంతో పాటు ప్లాస్టిక్‌ను తొలగిస్తే వాటికి ఎంతో ఉపశమనం కలుగుతుందన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో చెరువులను దత్తత తీసుకుని వాటిని అభివృద్ధి చేయటంతో పాటు సంరక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులతో పాటు వలంటీర్లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా చెరువుల పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు.

గల్లంతైన మృతదేహం లభ్యం



రవి మృతదేహం

చేవెళ్ల: మండల కేంద్రంలోని పుష్కరిణిలో ఈతకు వెళ్లి గల్లంతైన తాపీమేస్త్రీ మృతదేహం ఆదివారం లభ్యమైంది. ఏపీలోని ప్రకాశం జిల్లాకు చెందిన తాపీ మేస్త్రీ రవి(38) శుక్రవారం సాయంత్రం మద్యం మత్తులో ఈతకు వెళ్లాడు. దమ్ము రావడంతో నీట మునిగి గల్లంతైన విషయం తెలిసిందే. శనివారం గజ ఈతగాళ్లతో అతడి ఆచూకీ తెలియలేదు. ఆదివారం మృతదేహం నీటిపై తేలడంతో పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.